
సాక్షి పల్నాడు

మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 517.60 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైభవంగా శ్రీవారి కళ్యాణోత్సవం

నరసరావుపేట ఈస్ట్: స్థానిక శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం శ్రీవారి శాంతి కళ్యాణం వైభవంగా నిర్వహించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన



నరసరావుపేట: పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ సోమవారం తెలిపారు. ప్రజలు అవకాశాన్ని ఉపయోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

సామాజిక న్యాయం సీఎం ఆశయం

నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్‌కు ఘనస్వాగతం పలుకుదాం

- తొలిసారి బీసీలకు కేటాయించిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి
- అన్ని వర్గాలకు రాజకీయంగా సముచిత స్థానం
- రేపు నరసరావుపేటలో భారీ సభ నిర్వహణ
- మీడియా సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి. పక్కన మంత్రి అంబటి రాంబాబు, చిలకలూరిపేట సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు

సాక్షి, నరసరావుపేట: నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్న మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ బుధవారం జిల్లాకు వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలుకుదామని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. స్థానిక మున్సిపల్ గెస్ట్‌హౌస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అంబటి రాంబాబు, చిలకలూరిపేట సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడుతో కలసి మాట్లాడారు. నరసరావుపేట పార్లమెంట్ సమన్వయకర్త, మాజీమంత్రి అనిల్ కుమార్ యాదవ్ రాక సందర్భంగా బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పిన్నెల్లి మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజకీయంగా, సామాజికంగా న్యాయం చేయాలని ఆశయంతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ పని చేస్తోందని చెప్పారు. అందులో భాగంగా ఎంతో కీలకమైన, ప్రముఖులు పోటీ చేసిన నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి ఈ దఫా బీసీలకు అవకాశం ఇవ్వాలని జగనన్న నిర్ణయించారని పేర్కొన్నారు. అందులో భాగంగా విద్యావంతుడు, యువకుడైన డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌ను కొత్తగా పార్లమెంట్ సమన్వయకర్తగా నియమించారని చెప్పారు. ఇది ఎంతో సాహసోపేతమైన నిర్ణయమని వివరించారు. ఏడు నియోజకవర్గాలకు చెందని వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లాలో 2019 ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానంలో విజయం సాధించామని, 2024లోనూ ఇదే ఒరవడి కొనసాగించాలని ఆకాంక్షించారు. గత ముఖ్యమంత్రిలా కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతోందని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి అన్ని వర్గాలకు ప్రాంతాలకు వివక్ష లేకుండా అందుతున్నాయని తెలిపారు. సుమారు రూ.2.6 లక్షల కోట్లను డీబీటీ ద్వారా నేరుగా ప్రజలకు అందించిన ఘనత వైఎస్సార్ సీపీకి దక్కుతోందన్నారు. ప్రతి కుటుంబానికి మేలు చేసి, ఓటు అడుగుతున్నామన్నారు. టీడీపీ ఎన్ని పార్టీలతో కలసి కూటమిగా వచ్చినా, అబద్ధలు ప్రచారం చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలేదని ఎద్దేవా చేశారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే పేదల సంక్షేమం

విజయపురిసౌత్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తోనే పేదల సంక్షేమం సాధ్యమని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మాచర్ల మండలం నాగులవరంలో రూ.25 లక్షలతో నిర్మించిన బాప్టిస్ట్ చర్చిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతి కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం మాచర్ల మండల నాయకుడు బూడిద శ్రీనివాసరావు సొంత నిధులతో పీఆర్కేపై పాడించిన రెండు పాటల సీడీని పీఆర్కే, పీవీఆర్ ఆవిష్కరించారు. తొలుత బెల్లంకొండవారిపాలెంలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ నెల 15వ తేదీన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకులు బెల్లంకొండవారి పాలెం, నాగులవరం నూతన చర్చి వద్ద, బూడిద శ్రీను గృహం వద్ద ఏర్పాటు చేసిన కేక్‌లను పీఆర్కే కట్ చేశారు. భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, మాచర్ల ఎంపీపీ బూడిద మంగమ్మ, వైస్ ఎంపీపీ పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డి, బూడిద సైదులు, నాగులవరం సర్పంచి గోగిరెడ్డి వెంకట్రావమ్మ, వెంకటేశ్వరరెడ్డి, ఉప సర్పంచి వస్త్రపురి రాములు, గన్నెబోయిన శివరంగయ్య, గొట్టిముక్కల ఏడుకొండలు, గంటా శ్రీధర్, వడ్డే వెంకట్రామయ్య, ఐనబోయిన శ్రీను, కొత్తపల్లి సర్పంచి ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, కొప్పునూరు సర్పంచి నోముల కృష్ణ, శ్రీనివాసరెడ్డి, గంగవరపు కోటేశ్వరావు, కటికల బాలకృష్ణ, చాగంటి పెంకులయ్య, చాగంటి వెంకటేశ్వర్లు, రెంటాల లింగమంతు, కొత్త నాగరాజు, పొందుగుల సత్యనారాయణరెడ్డి, బద్దెల పుల్లయ్య, గన్నెబోయిన బాలరాజు, మర్రి బ్రహ్మయ్య, మాజీ ఎంపీటీసీ బద్దెల శ్రీను పాల్గొన్నారు.



బెల్లంకొండవారిపాలెంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న పీఆర్కే

ఎన్నికల ఫారాలను త్వరగా పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అవరమైన ఫారాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కమాండ్ కంట్రోల్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల్లోని సిబ్బంది వివరాలను సేకరించి త్వరితగతిన డేటాను సిద్ధం చేయాలని చెప్పారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, జగనన్న సురక్ష వలంటీర్ల సర్వే, నవరత్నాలలో భాగమైన పేదలందరికి ఇల్లు కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ, మ్యాజిక్ సోక్ పిట్ల ఏర్పాటు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.వినాయకం, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్, డి.యల్.డి.ఓ. వెంకటరెడ్డి, గ్రామ వార్డు సచివాలాయాల అధికారి గౌసియా పాల్గొన్నారు.

కొండవీడు ఫెస్ట్ అదిరింది

యడ్లపాడు: కొండవీడు ఫెస్ట్ -2024 ఉత్సవాలు విజయవంతం అయ్యాయని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఉత్సవాలు దిగ్విజయంగా ముగిసిన సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు లక్ష్యానికి మించి మూడింతల ప్రజా స్పందన లభించిందన్నారు. ఫెస్ట్ విజయవంతం అయ్యేందుకు భాగస్వాములైన ప్రతిఒక్కరిని అభినందనలు తెలిపారు. ఉత్సవాలకు పుట్టకోట నుంచి కొండమీదకు ఆర్టీసీ ఆరు బస్సులు ఏర్పాటు చేయగా రూ.1,37,572 ఆదాయం చిలకలూరిపేట ఆర్టీసీ డిపోకు వచ్చినట్లు డీపీటీఓ ఎన్.శ్రీనివాస్ తెలిపారు. జలషికారుకు బోట్లు ఏర్పాటు చేయగా వాటి ద్వారా రూ.50 వేలు, గన్ షూటింగ్, విలువిద్య క్రీడాలకు రూ.50 వేలు, ట్రెక్కింగ్ ద్వారా రూ.15 వేలు, హార్స్ రైడింగ్‌కు రూ.15వేలు ఆదాయం వచ్చినట్లు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు తెలిపారు.

న్యూస్‌రీల్

సీఎం వైఎస్ జగన్ పర్యటన షెడ్యూల్ ఖరారు

పట్నంబజారు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో గురువారం పర్యటించనున్నారు. షెడ్యూల్ ఇలా..

- తాడేపల్లి సీఎం నివాసం నుంచి 2.45 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి, ఫిరంగిపురం సెయింట్ పాల్స్ హైస్కూల్ గ్రౌండ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులను కలుస్తారు.
- 3.15 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి ఫిరంగిపురం మండలం రేపూడిలో పీఎన్‌సీ ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరవుతారు.
- 3.20 గంటల నుంచి 4.50 గంటల వరకు వలంటీర్ల అభినందన సభలో పాల్గొంటారు.
- 4.55 గంటలకు సెయింట్ పాల్స్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో హెలిప్యాడ్ వద్దకు చేరుకుని, సాయంత్రం 5.25 వరకు స్థానిక నేతలను కలుస్తారు. అనంతరం 5.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా తాడేపల్లి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి విరాళం

తాడేపల్లిరూరల్: మంగళగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి దాత రూ.10 లక్షలు విరాళం సోమవారం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.రామకోటిరెడ్డికి విజయవాడకు చెందిన కేతినేని గోపాలకృష్ణ, నాగ నీలమ్మ దంపతులు అందజేశారు. దాతలకు తీర్థ ప్రసాదాలు అందించారు.

నేటి నుంచి విజయకీలాద్రిపై వార్షిక బ్రహ్మోత్సవాలు

తాడేపల్లిరూరల్: పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ ఆస్పత్రిగా నామకరణంపై హర్షం



ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మెడికల్ హాస్పిటల్, కాలేజీకి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హాస్పిటల్, కాలేజీగా నామకరణం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృతజ్ఞతలను తెలిపారు. ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతానికి ఇప్పటి వరకు కనీసం 50 పడకల హాస్పిటల్ కూడా అందుబాటులో లేని దుస్థితి ఉందన్నారు. వైఎస్. జగన్ సీఎం అయిన ఏడాదిలోనే సుమారు రూ.500 కోట్లతో 600 పడకల మెడికల్ హాస్పిటల్‌తో పాటు మెడికల్ కళాశాలను మంజూరు చేయటం జరిగిందని చెప్పారు. పల్నాడు ప్రజలకు వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్యశాల, కాలేజీగా ఈ ప్రాంత ప్రజలకు సంజీవినిగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ ఆస్పత్రి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు.

నేడు భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి (పీఎఫ్) ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు వారి ఫిర్యాదులు, దరఖాస్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించారు. so.guntur@epfindia.gov.in తో పాటు వాట్సాప్ నంబరు 94946 57469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ 0863-2344106, 2232921 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. అదే విధంగా వెబ్ ఎక్స్ ఐడీ 26430135284, పాస్‌కోడ్ epgo:1234 ద్వారా లాగిన్ కావాలని తెలిపారు. పీఎఫ్ పెన్షన్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మహాశివరాత్రి ఏర్పాట్లపై సమావేశం

నరసరావుపేట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ మహాతిరునాళ్ల ఏర్పాట్లపై మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో నిర్వహించనున్న సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

అమ్మపైనా కనికరం లేదు..



ఈ ఫొటోలో కనిపిస్తున్న అమ్మ పేరు జి.సీతారావమ్మ. తాడికొండ మండలం పొనుగుపాడు. ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆమె పేరు మీద ఉన్న ఆస్తిని మనవడు మాయ మాటలతో రాయించుకున్నాడు. ఇప్పుడు పట్టించుకోవడం లేదు. ఆమెకు దిక్కు తోచడం లేదు. దీంతో జగనన్నకు చెబుదాంను ఆశ్రయించింది. ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరింది. ముగ్గురు పిల్లలకు పంపిణీ చేసి నా పోషణ బాధ్యత ముగ్గురుకి అప్పగించాలని అధికారులకు విన్నవించింది...

- కలెక్టరేట్ స్పందనలో అర్జీలు స్వీకరించిన జేసీ రాజకుమారి
- సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ రాజకుమారి

పాత గుంటూరు: కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి అధ్యక్షత వహించారు. 189 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. రీ ఓపెన్ అయిన పిటిషన్లను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, డెప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, ఆర్డీఓ పి.శ్రీకర్, పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, పశు సంవర్ధక శాఖ జేడీ వెంకటేశ్వర్లు, జెడ్పీ అసిస్టెంట్ సీఈఓ జే.మోహన్‌రావు, డీఎస్ఓ కె.పద్మ పాల్గొన్నారు.

మా ఇళ్లను కూల్చేస్తున్నారు



ఎస్టీ కాలనీలో 40 ఏళ్లుగా ఉంటున్నాం. గ్రామానికి చెందిన కొందరు తమ ఇళ్లను కూల్చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారు. వారి ప్లాట్లకు అడ్డుగా ఉన్నామని ప్రస్తుతం నాలుగు ఇళ్లను కూల్చేశారు. మరి కొన్ని ఇళ్లను మేములేని సమయాల్లో కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికారులు స్పందించి మాకు రక్షణ కల్పించాలి.

– రెడ్డిపాలెం ఎస్టీ కాలనీవాసులు

చేనేతలను ఆదుకున్న ఘనత జగనన్నదే

- ఎంపీ విజయసాయిరెడ్డి,
- మంగళగిరిలో చేనేత భవనం ప్రారంభోత్సవం




డాక్టర్ వైఎస్సార్, ప్రగడ కోటయ్య చేనేత భవనం శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, చిత్రంలో గంజి చిరంజీవి, హనుమంతరావు, కాండ్రు కమల, జూపూడి తదితరులు

తాడేపల్లిరూరల్: చేనేత కార్మికులను ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని నిడమర్రు పాత బస్టాండ్ ప్రాంగణంలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్, ప్రగడ కోటయ్య చేనేత భవనాన్ని రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డితో కలసి సోమవారం ప్రారంభించారు. అతిథులుగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ జూపూడి ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల హాజరయ్యారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశంలో ఆంధ్రప్రదేశ్‌లో చేనేతలకు దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాత 50 ఏళ్లకే చేనేతలకు సామాజిక పెన్షన్ అందజేయాలని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి దానిని అమలు చేశారని చెప్పారు. చేనేత కార్మికులు తాము నేసిన బట్టలకు సరైన ధర లేకపోవడంతో ప్రత్యేకంగా రూ.250 కోట్లు కేటాయించి, నూలు, రంగులు, ఇతర ముడి సరుకులలో రాయితీలు కల్పించి చేనేతలను ఎంతో ఆదుకున్నారని వివరించారు. మంగళగిరి నియోజకవర్గంలో చేనేత కార్మికులకు సొంత నివాసాలు లేవంటే ప్రత్యేకంగా విలువైన 25 ఎకరాల భూమిని కేటాయించి చేనేతలకు అందజేశారని, అదే సమయంలో చేనేత కార్మికులు మగ్గాలు ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు చేనేతలను పట్టించుకోకపోవడంతో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చొరవతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో చేనేత కార్మికుల కోసం మంగళగిరిలో 146 మగ్గాలు ఏర్పాటు చేసి చేనేతలకు అందజేశామని, తండ్రి బాటలోనే నడుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులకు ప్రాధాన్యం కల్పించి సమన్వయకర్తగా గంజి చిరంజీవిని నియమించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులకు ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు డిసెంబర్ 21న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్హులైన 81 వేల మంది చేనేత కార్మికులకు సంవత్సరానికి రూ.24 వేలు చొప్పున ఐదేళ్లలో లక్ష ఇరవై వేల రూపాయలు అందజేశారని వివరించారు. మంగళగిరిలో చేనేత కార్మికులు ఎక్కువ మంది ఉండడంతో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రగడ కోటయ్య చేనేత భవనాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చేనేతలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అండగా ఉండగా మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్, పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కుబేర స్వామి, స్టేట్ బీసీ సెల్ అధ్యక్షుడు చిల్లపల్లి మోహనరావు పాల్గొన్నారు.

వంగిపురం వీఏఏ చేతివాటం

- శనగలు రాయితీ సొమ్ముతో పరార్
- నెల రోజుల నుంచి విధులకు గైర్హాజరు
- సుమారు రూ.14 లక్షలు మాయం



ఏఓకు పంపిన బ్యాంకు నకిలీ రశీదు

ప్రత్తిపాడు: శనగలు రాయితీ సొమ్ము ఓ వీఏఏ నొక్కేసిన ఘటన వెలుగుచూసింది. వివరాలు.. ప్రత్తిపాడు మండలం వంగిపురంలో వీఏఏగా మేకపోతుల హరీష్ విధులు నిర్వర్తిస్తున్నాడు. తాడికొండ మండలం పాములపాడు నుంచి డెప్యూటేషన్‌పై పనిచేస్తున్నాడు. ప్రభుత్వం రూ.29.09 లక్షల విలువైన విత్తనాలు విక్రయించారు. రూ.14.76 లక్షలు మాత్రమే విడతల వారీగా చెల్లించి, మిగిలిన రూ.14.33 లక్షల చెల్లించకుండా వెళ్లిపోయాడు.

ఏపీ సీడ్స్‌కు సొమ్ము చెల్లించకుండా..

ఏపీ సీడ్స్‌కు చెల్లించాల్సిన సొమ్ము చెల్లించాలంటూ ప్రత్తిపాడు ఏఓ అరుణకుమారి, రాజేష్‌కు అనేక సార్లు సూచించారు. అబద్ధాలు చెబుతూ వచ్చాడు. దీంతో అనుమానం వచ్చిన ఆమె విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

బ్యాంకు నకిలీ రశీదుతో..

విధులకు గైర్హాజరు అవుతుండడంతో స్థానిక వ్యవసాయాధికారి అరుణకుమారి, రాజేష్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో రాజేష్ నకిలీ బ్యాంకు రశీదులను సృష్టించాడు. రూ.రెండు లక్షలు డిపాజిట్ చేసినట్లుగా ఏఓకు వాట్సాప్ ద్వారా నకిలీ బ్యాంకు రసీదును పంపించాడు. దీంతో ఏఓ అరుణకుమారి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్తిపాడు పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. దీనిపై ఏఓ అరుణకుమారిని 'సాక్షి' వివరణ కోరగా ఏపీ సీడ్స్‌కు రూ.14 లక్షలు చెల్లించాల్సి ఉందని, అందులో కొంత నగదు ఇంకా రైతుల నుంచి రావాలని గతంలో రాజేష్ చెప్పాడని, అతను అందుబాటులోనికి వస్తే గానీ అన్ని విషయాలు స్పష్టంగా తెలుస్తాయని పేర్కొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- గుంటూరు డీవైఈఓ వెంకటేశ్వరరావు
- గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి 94 ప్రాజెక్టుల ప్రదర్శన
- రాష్ట్ర స్థాయికి ఎంపికైన తొమ్మిది ప్రాజెక్టులు



విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను తిలకిస్తున్న డీవైఈఓ వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సృజనకు పదును పెట్టి, భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే ఇన్‌స్పైర్ ప్రదర్శన లక్ష్యమని గుంటూరు డీవైఈఓ పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 2022–23 విద్యాసంవత్సర ఇన్‌స్పైర్ మానక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం నిర్వహించారు. గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి 94 ప్రాజెక్టులు ప్రదర్శించారు. డీవైఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే వారి సృజనాత్మకతకు పదునుపెట్టేలా విజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ కొత్త ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సాహమందిస్తున్నారని అన్నారు. తెనాలి డీవైఈఓ ఎం.నిర్మల మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందించడం ద్వారా విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దవచ్చునని పేర్కొన్నారు. ఈనెల 18న చిత్తూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు తొమ్మిది ఎగ్జిబిట్‌లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణ జస్విన్, డీసీఈబీ కార్యదర్శి లలిత్ ప్రసాద్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, గుంటూరు, బాపట్ల జిల్లాల సైన్స్ అధికారులు అడుసుమల్లి రవికుమార్, మొహమ్మద్ సాదిక్, సైన్స్ కోఆర్డినేటర్లు గౌసుల్ మీరా, పవని భానుచంద్రమూర్తి, సికిందర్ మీర్జాన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసిన ప్రాజెక్టులు ఇవే..

గైరుబోయిన యశస్విశివ సాయి, కేజీ హైస్కూల్, కొత్తరెడ్డిపాలెం(చేబ్రోలు), పీసపాటి మస్తాన్‌రావు, సిరిపురం జెడ్పీ హైస్కూల్(మేడికొండూరు), షేక్ సనా బుష్రా(నేతాజీనగర్ మున్సిపల్ హైస్కూల్, పొన్నూరు), వరగాని తోమరాజు(గొట్టిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్, (ప్రత్తిపాడు), కొచ్చర్ల శిరీష, జెడ్పీ హైస్కూల్, ముట్లూరు(వట్టిచెరుకూరు మండలం), సంపతి అమూల్య, జెడ్పీ హైస్కూల్, బల్లికురవ (ప్రకాశం), చిరతనగండ్ల అమూల్య, జెడ్పీ హైస్కూల్, పావులూరు(ఇంకొల్లు), చదువుల సింధూజ, జెడ్పీ హైస్కూల్, జంపని(వేమూరు), ఎల్లల వైష్ణవి శ్రీ ప్రకాశం ప్రభుత్వ ఉన్నత పాఠశాల(అద్దంకి).

క్లుప్తంగా

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం !

మంత్రి విడదల రజిని



నెహ్రూనగర్: నగరంలో వాంతులు, విరేచనాలు లక్షణాలతో అనారోగ్యానికి గురైన వారికి తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో మంత్రి విడుదల రజిని, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కమిషనర్ ఫ్యామిలీ వెల్ఫేర్ నివాస్, ఏపీవీవీపీ కమిషనర్ వెంకటేశ్వర్లు, కలెక్టర్ వేణుగోపాల రెడ్డి, గుంటూరు మున్సిపల్ కమిషనర్ కీర్తి చేకూరితో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనారోగ్య సమస్యలకు గల కారణాలపై స్పష్టత రావాలని చెప్పారు. నివేదికలు త్వరగా వచ్చేలా చూడాలని అధికారుల్ని ఆదేశించారు. మంచినీటి సమస్య అయి ఉండొచ్చని భావిస్తున్న నేపథ్యంలో ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా అందించాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ వాంతులు, విరేచనాల లక్షణాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

ప్రాథమిక లక్షణాలుంటే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చి చికిత్సలు చేయించుకునేలా ప్రజలకు అధికారులు విస్తత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ నగరంలో అస్వస్థతకు గురైన ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా నిరంతరం వైద్యారోగ్యశాఖ అధికారులతో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధితో ఆర్థికభరోసా

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- రూ.12.96 లక్షల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులతో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పేదవర్గాలకు ఆర్థిక భరోసా కల్పించేలా ముఖ్యమంత్రి సహాయనిధి తోడ్పాటు అందిస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సోమవారం సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, నకరికల్లు మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు రూ.12.96 లక్షల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ జాబితాలో లేని వ్యాధులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణానికి చెందిన షేక్ మీరాకు రూ. 75 వేలు, సాయిబోయిన కృపావతికి రూ.36 వేలు, పాకాలపాడుకు చెందిన కాల్వపల్లి వెంకటేశ్వర రెడ్డికి రూ.6 లక్షలు, మారేళ్ళ మల్లేశ్వర రెడ్డికి రూ.1.50 లక్షలు, కాసా రామకృష్ణకు రూ. 60 వేలు, కోదారి సుబ్బారావుకు రూ. 1.60 లక్షలు, మాదల శ్రీనుకు రూ. 85 వేలు, తుమ్మల చెరువు హనుమంత రావుకు రూ.1.30 వెరసి మొత్తం రూ. 12,96 లక్షల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, సత్తెనపల్లి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమ రావు, నాయకులు బాసు లింగారెడ్డి, అచ్యుత శివప్రసాద్, చిలకా జైపాల్, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ

- దట్టమైన మంచుతో రోడ్డు ప్రమాదం
- ఐదుగురికి గాయాలు



ముందు బాగం పూర్తిగా దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు





ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భార్యాభర్తలు

చేబ్రోలు: దట్టమైన మంచులో సరిగా కనిపించకపోవడంతో ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టడంతో ఐదుగురికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ శివారులో సోమవారం జరిగింది. గుంటూరు నుంచి తెనాలి వెళ్తున్న ఆర్టీసీ బస్సు నారాకోడూరు సమీపంలోని అమృత దాబా సెంటర్ ఎదురుగా ముందు వెళ్తున్న లారీని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో పాత గుంటూరు ప్రాంతానికి చెందిన భార్యాభర్తలు జె. రాధాకృష్ణమూర్తి, కోటేశ్వరమ్మలకు కాళ్లు విరిగిపోయాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. గుంటూరు ప్రాంతానికి చెందిన రాధా కృష్ణమూర్తి, కోటేశ్వరమ్మలు తెనాలి నుంచి ట్రైన్‌లో తిరుపతి దైవదర్శనానికి వెళ్లడానికి తెల్లవారుజామున బస్సు ఎక్కారు. తీవ్ర గాయాలైన దంపతుల్ని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక బృందాలతో ఇంటిదొంగలను పట్టుకోండి

జిల్లా క్రైం విభాగానికి ఎస్పీ సూచన



నరసరావుపేట: ఇళ్లల్లో జరుగుతున్న చోరీలపై దృష్టి సారించి నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దొంగలను పట్టుకొని చోరీ సొత్తును రికవరీ చేయాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి సూచించారు. ఇటీవల నిర్వహించిన సాధారణ అదనపు ఎస్పీల బదిలీల్లో పల్నాడు జిల్లా క్రైం విభాగ అదనపు ఎస్పీగా సీహెచ్.లక్ష్మీపతి నియమితులయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మర్యాద పూర్వకంగా ఎస్పీని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనకు ఎస్పీ శుభాకాంక్షలు తెలియజేశారు. చోరీలు, దోపిడీలు తదితర నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచన చేశారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం ఈపురుపాలెం-బోయినవారిపాలెం రైల్వే గేట్ల మధ్య చోటుచేసుకుంది. ఈపురుపాలెం-బోయినవారిపాలెం రైల్వే గేట్ల మధ్యలో వ్యక్తి మృతి చెంది ఉన్నాడనే సిబ్బంది అందించిన సమాచారంతో ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు జీఆర్పీ ఎస్ఐ సీ.హెచ్.కొండయ్య తెలిపారు. మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందని, శరీరంపై తెలుపు రంగు చొక్కా, నీలం, తెలుపు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడని వివరించారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. ఒంగోలు వైపు వెళ్లే గుర్తు తెలియని రైలును మృతుడు గమనించకుండా పట్టాలు దాటుతుండగా ఢీకొని ఉంటుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు 94440 62746 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కృష్ణానదిలో పడి విద్యార్థి ఆత్మహత్య



కృష్ణానదిలో లభ్యమైన గణేష్ మృతదేహం

అచ్చంపేట: కృష్ణానదిలో పడి విద్యార్థి మృతి చెందిన ఘటన సోమవారం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం చామర్రులో చోటుచేసుకుంది. ఎస్ఐ మణికృష్ణ తెలిపిన వివరాల మేరకు అచ్చంపేటకు చెందిన బత్తుల గణేష్ (15) వేల్పూరు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో పోలీసులకు తల్లిదండ్రులు సమాచారం ఇచ్చారు. సోమవారం ఉదయం గణేష్ మృతదేహం కృష్ణానదిలో లభ్యమయినట్లు పోలీసులు తెలిపారు. కొద్ది కాలంగా చదువు పట్ల శ్రద్ధ చూపకుండా జులాయిగా తిరుగుతున్నాడని తల్లిదండ్రులు మందలించటంతో మనస్థాపానికి గురై కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకి పాల్పడినట్లు మృతుడి తల్లిదండ్రులు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు.

గంజాయి అమ్మకం కేసులో ఇద్దరి అరెస్టు

అద్దంకి రూరల్: గంజాయి అమ్మకం కేసులో ఇద్దరిని అద్దంకి పట్టణంలో సోమవారం రాత్రి సీఐ కృష్ణయ్య అరెస్టు చేశారు. కడప జిల్లాకు చెందిన నాదెండ్ల ఇమామ్‌బాషా, గాదెంశెట్టి జీవన్ కుమార్‌లు చెడు అలవాట్లుకు బానిసలై సులభంగా డబ్బులు సంపాదించి జల్సా చేస్తుంటారు. ఈ క్రమంలో గంజాయిని కొనుగోలు చేసి వాటిని చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారు చేసిన అమ్ముతుంటారు. ఇద్దరూ ప్రొద్దుటూరు నుంచి విజయవాడ వెళ్లడానికి స్థానిక భవానీ సెంటర్‌లో ఉన్నారన్న సమాచారం రావడంతో వారిని పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుల్ని కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు.

నాన్న పింఛను... అన్న తీసుకోనివ్వడం లేదు!

- జగనన్నకు చెబుదాంలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన చెల్లెలు
- సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన ఎస్పీ రవిశంకర్ రెడ్డి
- జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారికి అన్నదానం



ఎస్పీకి సమస్య వివరిస్తున్న బాధితులు

నరసరావుపేట: జగనన్నకి చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందనలో పాల్గొని ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, ఉద్యోగ మోసాలు తదితర సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. స్పందనకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారికి దాతల సహకారంతో అన్నదానం చేశారు. ఫిర్యాదుల స్వీకరణలో అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్. రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి రామచంద్ర రాజు, డీఎస్పీలు పల్లపు రాజు, వి.ఎస్.ఎన్ వర్మ, జి.సి.గురునాథ్ బాబు, షేక్ షర్ఫుద్దీన్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది సహకారం అందజేశారు. వచ్చిన ఫిర్యాదుల్లో...

దిక్కున్న చోట చెప్పకోమంటున్నాడు

నా తండ్రి ఏఎస్ఐగా పనిచేసి 2011లో పదవీ విరమణ చేసి గతేడాది నవంబరులో చనిపోయారు. మేం ఆయనకు ఐదుగురం సంతానం. ఇద్దరు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు కాగా ఒకరు చనిపోయారు. నలుగురిలో ఆడపిల్లల్లో ఒకదానినైన నాకు నా తండ్రి నామినీగా పింఛన్ రాశారు. అయితే నా సోదరుడు ఆ పింఛన్ తీసుకోవాలంటే అవసరమైన ఫ్యామిలీ సర్టిఫికెట్, ఒరిజినల్ పత్రాలు నీకు ఇవ్వాలంటే నాకు రూ.6 లక్షలు ఇవ్వాలని బెదిరిస్తున్నాడు. లేదంటే నీకు దిక్కున్న చోట చెప్పుకోమని వేధిస్తున్నాడు. నాకు ఆ పత్రాలు ఇప్పించి ఫ్యామిలీ సర్టిఫికెట్‌పై సంతకాలు చేయించండి.

– పగడాల శారద, అమరావతి

ఎస్టీయూ ఏపీ జిల్లా నూతన కార్యవర్గం



ఎల్.వి.రామిరెడ్డి



చంద్రజిత్ యాదవ్

నరసరావుపేట ఈస్ట్: జిల్లా రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ ఏపీ) నూతన కార్యవర్గ అధ్యక్షునిగా ఎల్.వి.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యు.చంద్రజిత్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్టీయూ 77వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. అలాగే ఆర్థిక కార్యదర్శిగా ఎ.ఏమండీ, గౌరవ అధ్యక్షుడిగా షేక్.కరిముల్లా ఎన్నికయ్యారు. అలాగే జిల్లా అసోసియేట్ అధ్యక్షులు, అదనపు ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల నియామకాల్లో పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని మండలాలకు ప్రాతినిధ్యం ఉండేలా నియామకాలు జరిపామన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షుడు రామిరెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో ఎస్టీయూ ఏపీ రాష్ట్ర నాయకులు కె.కోటేశ్వరరావు, ఎస్.ఎం.సుభాని, జె.గంగాధర బాబు, పోటు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

డీఎం అండ్ హెచ్‌వో బి.రవి



సిబ్బందితో వివరాలను అడిగి తెలుసుకుంటున్న డిఎంఅండ్‌హెచ్‌వో బి.రవి

అమరావతి: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరికీ అందిస్తున్న వైద్యసేవలను వినియోగించుకోవాలని అలాగే వైద్యాధికారులు వైద్యసేవలను ప్రజలకు అందించడంలో అంకితభావంతో పనిచేయాలని డీఎం అండ్ హెచ్‌వో బి.రవి సూచించారు. సోమవారం మండల పరిధిలోని అత్తలూరు పీహెచ్‌సీని సాధారణ తనిఖీలలో భాగంగా డీఎంఅండ్‌హెచ్‌వో బి.రవి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష, ఇటీవల పూర్తి చేసిన డీవార్మింగ్ కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చేనెల 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమం ఏర్పాట్లపై వైద్యాధికారులతో చర్చించారు. అలాగే సిబ్బంది పనితీరును, రికార్డులను పరిశీలించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్తలూరు పీహెచ్‌సీలో ప్రజలకు అందుతున్న సేవలు మరింత పెంచాల్సిన అవసరముందన్నారు. పీహెచ్‌సీలో మందులు, వైద్యపరీక్షల పరికరాలు పూర్తి స్థాయిలో ఉన్నాయన్నారు. జిల్లాలో ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు సుమారు ఆరు లక్షల మందికి ఇవ్వాల్సి ఉండగా అందులో ప్రస్తుతం 3.36 కార్డులు అందుబాటులోకి వచ్చాయన్నారు. అందులో ఇప్పటికే 2.40 లక్షల కార్డులు పంపిణీ చేశామనీ, మరికొద్ది రోజులలో మిగిలిన 76 వేల కార్డుల పంపిణీ చేస్తామన్నారు. అలాగే ఆయుష్మాన్ భారత్ కార్డులు సుమారు 5 లక్షల కార్డులు వచ్చినప్పటికీ సర్వర్లు పని చేయకపోవటంతో పంపిణీ మందకొడిగా సాగుతోందన్నారు.అత్తలూరు పీహెచ్‌సీ సుమారు 2 కోట్ల రూపాయలతో నూతన భవనాల నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆయన వెంట వైద్యాధికారి శివరత్న కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను పారదోలేందుకు కళాజాతాల నిర్వహణ

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు



కళాజాతాలో మాట్లాడుతున్న రామారావు

చినగంజాం: ప్రజల్లో మూఢ నమ్మకాల్ని పారదోలేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కళాజాతాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు తెలిపారు. స్థానిక చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన కళాజాతాను పురస్కరించుకొని ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సైన్స్ కళాజాత సిబ్బంది ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా వరకు సుమారు 2 వేల కిలోమీటర్ల పాటు పర్యటించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి జనవిజ్ఞాన వేదిక మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్ ఆధ్వర్యంలో మ్యాజిక్ షో, నాటికలు, పాటల రూపంలో ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చినగంజాం హైస్కూల్‌లో జేవీవీ మండల అధ్యక్షుడు ఎస్. నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి. రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు అద్దంకి విద్యార్థిని ప్రాజెక్టు

అద్దంకి: రాష్ట్రస్థాయి ప్రదర్శనకు అద్దంకి విద్యార్థిని ప్రాజెక్టు ఎంపికైంది. సోమవారం బాపట్ల జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మానక్ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎల్లాల వైష్ణవి తయారు చేసిన 'వేస్ట్ థర్మోకోల్ మేనేజ్‌మెంట్' సైన్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం కటకం శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ మంచి ప్రదర్శనగా నిలిచి పాఠశాలకు పేరు తేవాలని ఉపాధ్యాయులు సుంకర శ్రీదేవి, లక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పేరం సుధాకర్‌రెడ్డి ఆకాంక్షించారు.

14న మినీ జాబ్‌మేళా

నరసరావుపేట: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈనెల 14న కలెక్టరేట్ కార్యాలయంలో మినీ జాబ్ మేళా డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధికారి కె.సంజీవరావు సోమవారం వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ జాబ్‌మేళాలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. మేళాలో రెండు కంపెనీలు పాల్గొంటాయ న్నాయనీ, అభ్యర్థుల విద్యార్హతను బట్టి జీతం సుమారుగా రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ వరకు చదువుకున్న 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయస్సు మధ్య గల నిరుద్యోగ యువతి యువకులు వారి బయోడేటా, రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు ఎ.రమ్య 8328544388, ఎం.వీరాంజనేయులు 9160200652 సంప్రదించాలని కోరారు. ఆసక్తిగల యువతీ యువకులు ముందుగా www.aprrdc.i n అనే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోనటువంటి యువతీ యువకులు జాబ్ డ్రైవ్ జరిగే ప్రదేశంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. నరసరావుపేట నియోజకవర్గ పరిసర ప్రాంత యువతి యువకులు అందరూ పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సకల జనుల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- పెదకాకానిలో జగన్నామ సంక్షేమ సంగమం కార్యక్రమ నిర్వహణ
- 1237 మందికి వైద్య పరీక్షలు

పెదకాకాని: సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన పెదకాకానిలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండవ రోజు సోమవారం కూడా వైద్య శిబిరం నిర్వహించారు. కంటి, గుండె పరీక్షలతో పాటు ఫిజియోథెరపీ సేవల్ని 1,237 మంది వినియోగించుకున్నారు. డాక్టర్లు వైద్య పరీక్షల నిర్వహించి ఐదుగురికి యాంజియోగ్రామ్ సూచించారు. ఈ సందర్భంగా బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ నాడు– నేడు, అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన వంటి అనేక పథకాలతో పేదరికం నిర్మూలిస్తున్న నిజమైన ప్రజాయోధుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనలో పేదల ఇంటి ముందుకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ఇదే ఆదర్శంగా తీసుకుని అంకితభావంతో ప్రజాసేవను కొనసాగిస్తున్నామని వివరించారు. గత సంవత్సర కాలంగా బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నేత్రజ్యోతి ద్వారా ఉచిత నేత్ర వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఏడు పనిదినాల్లో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మీ గుండె పదిలం కార్యక్రమం ద్వారా ఉచిత గుండె పరీక్షలు, అవసరమైన వారికి యాంజియోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమస్య ఉన్న వారికి స్టంట్స్, బైపాస్ సర్జరీలు చేయిస్తున్నట్లు వివరించారు. దివ్యాంగ దర్శిని కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, జైపూర్ కాళ్లు, వెస్ట్రన్ కమోడ్‌లు అందజేసినట్లు చెప్పారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులను వైద్య శిబిరానికి ప్రత్యేక వాహనాల ద్వారా తీసుకువచ్చి పరీక్షలు నిర్వహించి, అదే వాహనంలో ఇంటికి తీసుకు వెళ్లడంపై ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణను గ్రామ ప్రజలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచి ఆళ్ల వీరరాఘవమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, చేబ్రోలు జెడ్పీటీసీ సభ్యురాలు బత్తుల అనురాధ, పొన్నూరు జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్, పార్టీ గ్రామ అధ్యక్షుడు వీర్ల వీరాంజనేయులు, నాయకులు ఆలా శ్రీనివాసరావు, దానబోయిన నాగేశ్వరరావు, ముడియాల మల్లికార్జునరెడ్డి, సుంకర కృష్ణారెడ్డి, ఆలపాటి రాఘవ, బి. కిశోర్, అప్పసాని చంద్రశేఖర్, కిలారి రమేష్, కుక్కల రాంప్రసాద్, షేక్ ఆరిఫ్, షేక్ నజీర్, కేతినేని ప్రసాద్, దూపాటి వెంకట్రావు పాల్గొన్నారు.